## కాలనీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



శ్రీకృష్ణనగర్ కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహ యాదవ్

**వనస్థలిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** కాలనీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషి చెస్తోందని డివిజన్ కాంగ్రెస్ పారీ వనస్థలిపురం అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్ పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ శ్రీకృష్ణనగర్ కాలనీలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతో మంజూరైన రూ.45లక్షల నిధులతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు మంగళవారం నర్సింహయాదవ్ కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మ యాదవ్ మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించడం సంతోషకరం అన్నారు. అందులో భాగంగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ సహకారంతో తమ కాలనీకి నిధులు మంజూరు కావడం హర్షనీయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజాసంక్షేమానికే పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి నాగిళ్ల వెంకటేష్, ఉపాధ్యక్షుడు యాదగిరిరావు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, శ్రీనివాసరావు, లింగమయ్య, శేఖర్ గౌడ్, ఆశీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



మీర్‌పేట్‌లో మహర్షి వాల్మీకికి నివాళులర్పిస్తున్న కమిషనర్ నాగమణి

**సరూర్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేట్‌లో కమిషనర్ పి.సరస్వతి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ జాన్‌కృపాకర్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై యాదగిరి, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, డీఈఈ వెంకన్న, ఏఈ హరీశ్, జేఏవో అరుణ, స్వప్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన మహర్షి జయంతి వేడుకల్లో కమిషనర్ నాగమణి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఏఎంసీ నంరెడ్డి నాగేందర్‌రెడ్డి, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గడ్డిఅన్నారం కురుమ సంఘం అధ్యక్షుడిగా శంకర్



ప్రమాణస్వీకారం చేస్తున్న భైర శంకర్, పాలకవర్గ సభ్యులు

**దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** గడ్డిఅన్నారం కురుమ సంఘం అధ్యక్షుడిగా భైర శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ప్రాంగణంలో నూతన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. భైర శంకర్‌తో పాటు ఉపాధ్యక్షుడు మేకల ఓదయ్య, ప్రధానకార్యదర్శి తుప్పటి శ్రీకాంత్, ఉపప్రధానకార్యదర్శి సమ్మి శ్రీనివాస్, కోశాధికారి సమ్మి రాజు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన అధ్యక్షుడు భైర శంకర్ మాట్లాడుతూ కురుమ సంఘం అభివృద్ధి కోసం పాటు పడడమే తన ధ్యేయమన్నారు.

## 26న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

**వనస్థలిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న వనస్థలిపురం గురుద్వార్ పక్కన ఉన్న రామాలయంలో అర్హత కలిగిన బ్రాహ్మణ యువతీ, యువకులకు వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పోచంపల్లి శ్రీధర రావు, నందిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వనస్థలిపురంలో వారు మాట్లాడుతూ వివాహం కానీ బ్రాహ్మణ యువతీ యువకులు తమ జీవిత భాగస్వామి కోసం ఈ వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ పేర్ల నమోదుకు వనస్థలిపురం సచివాలయనగర్‌లోని గాయత్రి భవన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంచామన్నారు. ఆసక్తి గలవారు తమ పేర్లను ఈనెల 16 వరకు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. మరిన్నివివరాలకు వివాహవేదిక కన్వీనర్ రామగిరి చంద్రశేఖరరావు ఫోన్ 9848779434ను సంప్రదించాలని కోరారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి



అధికారులతో మాట్లడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**కొత్తపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. న్యూ సమతాపురి కాలనీలో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను, సీటీఓ కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులనూ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బదులు తలెత్తకుండా పనులను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో న్యూసమతాపురి అధ్యక్షులు శ్రీనాధరావు, సీటీఓ కాలనీఅధ్యక్షుడు అంజయ్య, బీజేపీ నాయకులు తోట మహేందర్ యాదవ్ శరణ్ తదిరులు పాల్గొన్నారు.



డీసీ శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

## కొత్తపేట డివిజన్ సమస్యలు పరిష్కరించండి

**కొత్తపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** కొత్తపేట డివిజన్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ డీసీశ్రీనివాసరావుకు విన్నవించారు. మంగళవారం ఆయన డీసీని కలిసి వరదనటి కాల్వలు, పాడైన రహదారులు, పారిశుధ్యం, వీధిదీపాలు తదితర సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. శానిటేషన్ డీఈ చందన, రామ్‌కీ సిబ్బంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరమార్శిస్తున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరమార్శిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## అమెరికాలో దుండగుల కాల్పుల్లో
# విద్యార్థి మృతి బాధాకరం

**ఇబ్రహీంపట్నం, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యేలు**

**వనస్థలిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్-2కు చెందిన పోలే చంద్రశేఖర్ ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి దుండగుల కాల్పుల్లో మృతిచెందడం బాధాకరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విచారంవ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మృతుని కుటుంబ సభ్యులను పరమార్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రశేఖర్ మృతిచెందిన అదేరోజు మాజీ మంత్రి హరీ‌ష్‌రావుతోపాటు తాను బాధిత కుటుంబ సభ్యులను పరమార్శించామన్నారు. అందులో భాగంగా మంగళవారం మళ్లీ బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెప్పామన్నారు. అమెరికాలో నివాసముంటున్న తెలుగు ప్రజలతో(తానా) తాను ఎప్పటికప్పుడు మాట్లాడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మృతదేహానికి పోస్టుమార్టం కూడా పూరైందని, మృతుని కుటంబ సభ్యులు, మిత్రుల సందర్శనార్థం శని, ఆదివారాల్లో మృతదేహాన్ని ఇండియాకు తీసుకరావడానికి కృషి చెస్తున్నానన్నారు. కాగ బాధిత కుటుంబ సభ్యులకు తానా సభ్యులు తమవంతు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కోట్ల శివ ముధిరాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

- ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన విద్యార్థి చంద్రశేఖర్ గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో మృతి చెందడం బాధాకరమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విచారం వ్యక్తం చేశారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్-2లో నివాసం ఉంటున్న మృతుడు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే రంగారెడ్డి పరమార్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థి చంద్రశేఖర్ దుండగుల కాల్పుల్లో మృతిచెందడం ఆవేదనకు గురిచేసిందన్నారు. ఈ కష్ట కాలంలో వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం



ఇందిరానగర్‌లో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

**మన్సూరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. వరద, డ్రైనేజీ వ్యవస్థ సమస్యపై డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో కాలనీవాసుల విజ్ఞప్తి హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్బీ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ కేఎస్ఆర్ కాలనీలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాలనీలోని డ్రైనేజీవ్యవస్థ బ్లాక్ కావడంతో వర్షం పడితే రోడ్డుపై డ్రైనేజీ, వరదనీరు నిలుస్తున్నందున తక్షణమే పూడికతీసి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పవర్‌బోర్, హ్యాండ్ పంపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. కాలనీవాసులు వెంకటేష్‌గౌడ్, ధన్‌పాల్‌గౌడ్, సీవరేజ్ సూపర్‌వైజర్ సక్రునాయక్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ లలితాదేవి

## సరూర్‌నగర్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

**ఎల్‌బీనగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ లలితాదేవి మంగళవారం సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ప్రజలకు అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. బాలింతలను కలుసుకుని వారికి అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స వివరాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, నిర్వహణ పద్ధతులు, రోగులకు అందుతున్న వైద్యసేవల నాణ్యతపై సమీక్షించారు. విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగుల హాజరు, విధి నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల స్టోర్‌ను సందర్శించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయో లేదో తెలుసుకున్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ గీత, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి జోనల్ లెవల్ కబడ్డీ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం ప్రతాప్

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ హయత్‌నగర్ జోనల్ లెవల్ కబడ్డీ పోటీలు ఈ నెల 9వ తేదీన మండలంలోని బాటసింగారం జెడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభంకానున్నట్లు హెచ్ఎం ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నుంచి మొత్తం 120 జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. అండర్ 14, 17 విభాగంలో కబడ్డీపోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని హెచ్ఎం కోరారు. మంగళవారం స్కూల్ ఆవరణలో వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి కోర్టులను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, గోవర్ధన్‌రెడ్డి, చంద్రమోహన్, నర్సింగ్‌రావు, వెంకటేశ్వర్లు, ముత్యంరెడ్డి, అజయ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

## ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



సీఐటీయూ హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ కృష్ణయ్య, సభ్యులతో చంద్రమోహన్, నర్సిరెడ్డి

**మన్సూరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో పాలక వర్గాలు అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను సంఘటితంగా ప్రతిఘటిద్దామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. హయత్‌నగర్ సర్కిల్ సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశాన్ని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన చంద్రమోహన్, నర్సిరెడ్డి సర్కిల్ కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్‌గా చింతపల్లి కృష్ణయ్య, సభ్యులుగా నరహరి, అంజనేయులు, సుందర్ రావు, దయానంద్, ధనాజీ బీరదర్, ఎస్.సుభద్ర, శ్రీదేవి, లింగంయాదవ్, లింగస్వామి, నవనీత, లక్ష్మమ్మ, సింహాద్రి, అంజయ్య, నగేష్, చుక్కమ్మ, వజ్రమ్మ, అశోక్, ఇ.నరసింహను ఎన్నుకున్నారు. అనంతరం కార్మిక సమస్యలపై పోరాటం చేయాలని కోరారు.

## దుర్గామాత ఊరేగింపు ఘటనలో బాలుడి అరెస్టు

**చాదర్‌ఘాట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** దుర్గామాత విగ్రహం నిమజ్జన ఊరేగింపులో ఉద్రిక్తతకు కారకుడైన బాలుడిని చాదర్‌ఘాట్ పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోతీసుకొని జువైనల్ హోమ్‌కు తరలించారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి వివరాల ప్రకారం.. అక్బర్‌బాగ్ చౌరస్తాలో దుర్గామాతను శనివారం రాత్రి నిమజ్జనానికి తరలిస్తుండగా కోడిగుడ్డు విసరడంతో ఉద్రిక్తత తలెత్తింది. ఓ బాలుడు కోడిగుడ్డు విసిరినట్టు సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించి అదుపులో తీసుకున్నారు. అనంతరం జువైనల్ హోమ్‌కు తరలించారు.



ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



మద్యంప్రియులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

- టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు
- అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న 424 విద్యార్థులు, వాహనదారులు

**కొత్తపేట, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):** ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోనే సురక్షిత వాహన ప్రయాణం సాధ్యమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ 424 మంది విద్యార్థులకు, వాహనదారులకు సూచించారు. చౌటుప్పల్, నేలపట్ల ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్, భువనగిరి వలిగొండల్లో 8 ప్రైవటు పాఠశాలలు, కూడళ్లలో మంగళవారం వారు ట్రాఫిక్ నిబంధనలపై 17 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాల నివారణల్లో ప్రధానమైనది ట్రాఫిక్ నిబంధనలు పాటించడమేనని వారు తెలిపారు. విద్యార్థులకు, వాహనదారులకు కరపత్రాలను తెలుగు, ఇంగ్లిషు భాషల్లో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశామని పేర్కొన్నారు.

### 66 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడపకుండా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించే వీలుందని టీటీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 66 మంది మద్యం ప్రియులకు 66 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో మంగళవారం టీటీఐ లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి మద్యం అనర్థాలపై అవగాహన కల్పించడంలో భాగంగా సిబ్బంది రమేష్ సందేశాత్మక గీతాలు, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.

## పెంచిన బస్ చార్జీలను వెంటనే తగ్గించాలి

- సిటీ బస్సుల్లో ప్రయాణించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్

**హైదరాబాద్ సిటీ, ముషీరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** సిటీ బస్సుల్లో టికెట్ ధరలు పెంచడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి ఆరోపించారు. పెంచిన ఆర్టీసీ టికెట్ చార్జీలను నిరసిస్తూ మంగళవారం ఉదయం నాంపల్లి నుంచి అసెంబ్లీ వరకు ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. పెంచిన ధరలతో ఒక్కో ప్రయాణికుడిపై నెలకు రూ. 500కు పైగా అదనపు భారం పడుతుందన్నారు. పెంచిన బస్ టికెట్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెంచిన ధరలపై ప్రయాణికులతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో సామాన్య ప్రయాణికులపై ఆ భారం పడుతుందన్నారు. కాంగ్రెస్ పాలనకు ప్రజలు తగిన బుద్ధిచెబుతారని వారు హెచ్చరించారు.

## డీసీపీని కలిసిన కాంగ్రెస్ నేత




ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) అనురాధరెడ్డిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు దెంది శశిధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి డీసీపీకి మొక్కను అందించారు. - చంపాపేట,(ఆంధ్రజ్యోతి)

## సీజేఐపై దాడి ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడే: సీపీఐ

**హయత్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేసినట్లేనని సీపీఐ రాష్ట్ర కారవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం సీపీఐ హయత్‌నగర్ మండల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజైన రవీంద్రాచారి మాట్లాడుతూ దాడిచేసేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి శ్రీదేవి, నాయకులు సుధాకర్, సుజాత వంశీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**హయత్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** తెలంగాణ మున్సిపాలిటీ వర్కర్స్- ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అయిదో మహాసభలను విజయవంతం చేయాలని మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యాలయం ముందు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు కిషన్ మాట్లాడుతూ ఈ నెల 14, 15వ తేదీలలో మహాసభలు జరుగుతాయని తెలిపారు.

## బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు సాయికుమార్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ సీనియర్ నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయికుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు మాట్లాడుతూ మండలంలోని 1 జడ్పీటీసీ, 8 ఎంపీటీసీ, 14 సర్పంచ్ స్థానాల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు పోటీచేయనున్నట్లు, అన్నిస్థానాల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

## ధోబీఘాట్ పనులు పూర్తిచేయించాలి

**మన్సూరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** నాగోల్ డివిజన్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న ధోబీఘాట్ పనులను పూర్తిచేయించాలని నాగోల్ రజక సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మంగళవారం శామీర్‌పేటలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఈటల సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు పూర్తిస్థాయిలో చేపట్టేందుకు చొరవ తీసుకుంటానని పేర్కొన్నట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోల్ రజక సంఘం సభ్యులు బి.చుక్కయ్య, బి.కృష్ణ, బి.మధు, బి.మహేందర్ ఉన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

**సైదాబాద్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి):** డివిజన్‌లో పేరుకుపోయిన ప్రజాసమస్యలను ప్రాధాన్యం క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం లక్ష్మీనగర్ కాలనీలో రూ.12.50లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా మాస్టర్ ప్లాన్ రూపొందించానని వివరించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీసంక్షేమ సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణ గౌడ్, సురేందర్, ప్రఫుల్ కుమార్, కృష్ణయ్య, మోహన్ రావు, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహకు నివాళి

**ఎల్‌బీనగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** సరూనగర్ మాజీ సర్పంచ్, ఎల్‌బీనగర్ పురపాలక సంఘం మాజీ చైర్మన్ దర్పల్లి నర్సింహ వర్ధంతిని సరూర్‌నగర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సరూర్‌నగర్ పోస్టాఫీస్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌యాదవ్, దర్పల్లి నర్సింహ కుమారులు దర్పల్లి సుభాష్, దర్పల్లి అశోక్, రవి, దర్పల్లి మహేందర్, దర్పల్లి రాజు, వెంకటేశ్వరాకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనంరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, సాయికిరణ్, శ్రీనాథ్, సప్పిడి బాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ కార్యవర్గసభ్యుడు రమేష్‌యాదవ్, సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.

## అన్నదాన వితరణ అభినందనీయం

**కొత్తపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** పౌర్ణమి వేళ అన్నదాన వితరణ అభినందనీయమని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. మంగళవారం ఐవీఎఫ్ మహిళావిభాగం కొత్తపేటలో ఏర్పాటు చేసిన అన్నదాన వితరణను ఆయన ప్రారంభించారు. ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉపక్షౌల స్వప్న, రాష్ట్రప్రసిడెంట్ చందా భాగ్యలక్ష్మి, ప్రతినిధులు మణిమాల, పద్మ, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

## మిధానీ డైరెక్టర్‌గా పద విట్టన్‌బాబు బాధ్యతలు స్వీకరణ



విట్టన్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న మిధానీ సీఎండీ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి

**చంపాపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధానీ) డైరెక్టర్(ఉత్పత్తి, మార్కెటింగ్)గా పద విట్టన్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన పద విట్టన్‌బాబును మిధానీ సీఎండీ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి, మిధానీ డైరెక్టర్(ఫైనాన్స్) మధుబాల కల్లూరి తదితరులు అభినందనించారు. చెన్నైలోని మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి మెటలార్జికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచ్‌లర్ డిగ్రీ, హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి పద విట్టన్‌బాబు ఎంబీఏ పట్టాను అందుకున్నారు. మెటలార్జికల్ ఇంజనీర్‌తో పాటు ప్రత్యేక స్టీల్స్, సూపర్ అల్లాయ్స్ టైటానియం మిశ్రమ లోహాల వంటి ప్రత్యేలోహాలు, మిశ్రమ లోహాల రంగంలో ఆయనకు మూడు దశాబ్దాలకు పైగా విశేష అనుభవం ఉందన్నారు. 1997లో మిధానీలో చేరిన పద విట్టన్‌బాబు మార్కెటింగ్, ఉత్పత్తి, వ్యూహాత్మక ప్రణాళిక వంటి విభాగాల్లో కీలక పాత్రలు పోషించారు. మార్కెటింగ్ రంగంలో ఆయన కొత్త మార్కెట్‌లను అభివృద్ధి చేయడంలో ఎగుమతులను పునరుద్ధరించడం, ఏరోస్పేస్, రక్షణ, శక్తి, పారిశ్రామిక అనువర్తనాలు వంటి కీలక రంగాలలో దీర్ఘకాలిక సంబంధాలను నెలకొల్పడంలో ఆయన కీలకపాత్ర వహించారు.